శుక్ర వారం
24-11-2023
సంపుటి - 08,
సంచిక - 396
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# రేవంత్ దిష్టిబొమ్మ దహనం



**సంగారెడ్డి, నవంబర్ 23 (సమ సమాజం):** టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్‌ను అవమానించడంపై గిరిజన సంఘాలు భగ్గుమన్నాయి. రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అతడి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్నారు. తాజాగా జిల్లాలోని సిర్గాపూర్ మండలంలోని లక్ష్మణ్ నాయక్ తండలో స్థానిక సర్పంచ్ సోనీ బాయి, నాయకులు రాజు నాయక్ ఆధ్వర్యంలో తండా ప్రజలు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. నిన్న నారాయణఖేడ్‌లో జరిగిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డికి సేవలాల్ మహారాజ్ చిత్రపటాన్ని అందజేస్తుండగా కనీస మర్యాద లేకుండా అగ్రకుల దురంహకారం ప్రదర్శించాని గిరజనులు ఆగ్రం వ్యక్తం చేశారు. అనంతరం సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

# సమ్మిళిత, సమగ్ర అభివృద్ధి లక్ష్యం

## ప్రభుత్వ విధానాలతో భారీగా పెట్టుబడులు

- పెట్టుబడుల కేంద్రంగా హైదరాబాద్
- టీఎస్ ఐపాస్ ద్వారా 24 వేల పరిశ్రమలకు అనుమతులు
- 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- కాళేశ్వరంపై దుష్ప్రచారం తగదు
- తెలంగాణ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో కెటిఆర్
- మంచిగా పనిచేస్తే ఎవరూ వదులుకోరు
- బిఆర్ఎస్ పర్ఫార్మింగ్ గవర్నమెంట్
- మెగా కాన్ క్లేవ్‌లో మంత్రి కెటిఆర్ పలు ఆసక్తికర విషయాలను



**హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం):** సమ్మిళిత, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటిశాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌కు భారీ స్థాయిలో పెట్టుబడులు తరలివచ్చాయని కేటీఆర్ స్పష్టం చేశారు. దీంతో ఇవాళ ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు హైదరాబాద్ చిరునామాగా మారిందని కేటీఆర్

3వ పేజీలో...

# ఢిల్లీలో మాకు బాస్‌లు లేరు... ప్రజలే మాకు బాస్‌లు

## తెలంగాణ కోసమే బిఆర్ఎస్ పుట్టింది

- నిరంతర కరెంట్‌తో కార్మికులకు ఉపాధి
- పటాన్ చెరు సభలో సిఎం కెసిఆర్ వెల్లడి
- దళితుల కోసమే దళితబంధు
- దళితుల వాడ దొరలవాడగా మారిన హుజూరాబాద్
- వికారాబాద్‌లో పూర్తిస్థాయి అమలు చేస్తాం
- వికారాబాద్ సభలో సిఎం కెసిఆర్
- కాంగ్రెస్‌ను నమ్మితే కర్నాటక గతే
- మనవేలుతో మనలనే పొడుస్తారు
- నిరంతర కరెంట్‌కు పాతరేస్తారు
- ఆలోచించి ప్రజలు ఓటేయాలి
- సంగారెడ్డి సభటో కాంగ్రెస్‌పై విమర్శలు



**సంగారెడ్డి, నవంబర్ 23 (సమ సమాజం):** బీఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసం..హక్కుల సాధించుకోవడం కోసమని సీఎం కేసీఆర్ వ్యాఖ్యానించారు. గురువారం నాడు పతాన్ చెరు లోని ఎస్ఆర్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ...‘మాకు ఢిల్లీలో బాస్‌లు ఉండరు..మాకు బాస్ లు మీరే.. కాంగ్రెస్ పార్టీ మూడు గంటల కరెంట్ చాలని అంటున్నారు..వారి హయంలో తాగడనికి కూడా నీళ్లు ఇవ్వలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజల వద్ద ఉండే ఓకే ఒక ఆయుధం ఓటు. రాబోవు రోజుల్లో కాలుష్యం లేని కంపెనీలు కూడా ఇక్కడికి వస్తాయి. మియపూర్ టు ఇస్నానపూర్ వరకు త్వరలోనే మెట్రో రైలు వస్తే పతాన్ చెరు రూపు రేఖలు మారిపోతాయి. పతాన్ చెరు అంటే ఒక మినీ ఇండియా. ఎండాకాలం వస్తే ఇక్కడ వలసలు పోయేవారు..ఇప్పుడా ఆ సమస్య లేదు. ఒకప్పుడు ఇక్కడ తాగడానికి కలుషిత నీరు ఉండేది..మేము వచ్చాక మిషన్ భగీరథ నీళ్లు ఇచ్చాం. 2014లో మన తలసరి ఆదాయంలో 18వ స్థానంలో ఉండే..ఇప్పుడు తలసరి ఆదాయంలో నెంబర్ వన్ స్థానంలో ఉందని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలకు 24 గంటల కరెంట్ ఇవ్వడం వల్ల కార్మికుల సంపాదన పెరిగిందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. కార్మికులు డబుల్ డ్యూటీలు చేసుకుని, పది రూపాయాలు మిగిలించుకుంటున్నారని కేసీఆర్ తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద

3వ పేజీలో...

# తెలంగాణను అప్పులపాలు చేసి కెసిఆర్

## ప్రచార సభలో జెపి నడ్డా విమర్శలు



**సంగారెడ్డి, నవంబర్ 23 (సమ సమాజం):**సీఎం కేసీఆర్ తెలంగాణని అభివృద్ధి చేయడం కంటే రాష్ట్రాన్ని అప్పుల కూపంలోకి తీసుకెళ్లారని బీజేపీ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పేర్కొన్నారు. గురువారం నాడు ఆయన పలు ప్రాంతాల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. సంగారెడ్డిలోని గంజి మైదానంలో బీజేపీ విజయ సంకల్ప బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు. ఈ సభలో బీజేపీ సంగారెడ్డి, నారాయణఖేడ్ అభ్యర్థులు పులిమామిడి రాజు, సంగప్పలను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నడ్డా మాట్లాడుతూ... కల్వకుంట్ల కుటుంబం దోపిడీ తెలంగాణలో సాగుతోంది. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో భారీ అవినీతి జరుగుతుంది. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తానని కేసీఆర్ అంటున్నారు. బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే మత ప్రాతిపదికన రిజర్వేషన్లు తీసేస్తాం. బీఆర్ఎస్ అంటే భారత రాక్షస సమితి. ధరణితో పేదల భూములను కేసీఆర్ ప్రభుత్వం గుంజుకుందని నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సజావుగా తెలంగాణ ఎన్నికల నిర్వహణ

## ఏర్పాట్లు పూర్తయ్యాయన్న ఎన్నికల సంఘం

వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారి వికాస్ రాజు



**హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం):** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సజావుగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 3.26 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. అందులో పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు

2వ పేజీలో...

# తొలి మహిళాన్యాయమూర్తి ఫాతిమాబీ కన్నుమూత



**తిరువనంతపురం, నవంబర్ 23 (సమ సమాజం):** సుప్రీంకోర్టు మొట్టమొదటి మహిళా న్యాయమూర్తిగా పనిచేసిన ఫాతిమా బీవీ ఇక లేరు. ఆమె కొల్లాంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం కన్నుమూశారు. ఫాతిమా బీవీ వయసు 96 ఏళ్లు. తమిళనాడు రాష్ట్రానికి గవర్నర్ గా కూడా ఆమె సేవలు అందించారు. ఫాతిమా ట్రావెంకోర్ సమీపంలోని పతనంతిట్ట గ్రామంలో 1927 ఏప్రిల్ 30న జన్మించారు. తిరువనంతపురంలోని ప్రభుత్వ లా కళాశాలనుంచి బిఎల్ డిగ్రీ తీసుకున్నారు. 1983లో హైకోర్టు జడ్జిగాను, 1989లో సుప్రీంకోర్టు జడ్జిగానూ పదోన్నతి పొందారు. 1992లో రిటైరయ్యారు. ఫాతిమా బీవీ 1997 జనవరి 25న తమిళనాడు గవర్నర్ గా నియమితులయ్యారు. అయితే ఆమె పూర్తికాలం పదవిలో కొనసాగలేదు.

# ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు

## నేడు కొత్తగూడెంలో ప్రియాంక రోడ్ షో



**హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో

3వ పేజీలో...

# మోడీ, అమిత్‌షాల వల్లనే మ్యాచ్ ఓడాం

- కోల్‌కతా, ముంబైలో ఫైనల్ నిర్వహిస్తే గెలిచేవాళ్లం
- వారు పాపాత్ములు అంటూ మమతా బెనర్జీ విమర్శలు



**కోల్‌కత,నవంబర్ 23 (సమ సమాజం):** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

3వ పేజీలో...

# మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు

## రాహుల్‌కు ఇసి నోటీసులు జారీ

**న్యూఢిల్లీ, నవంబర్ 23 (సమ సమాజం):** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి కేంద్ర ఎన్నికల సంఘం నోటీసులు ఇచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు నోటీసులు పంపింది. మోదీని దురదృష్టవంతుడు అని రాహుల్ విమర్శలు చేశారు. భారత్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ఓడిపోవడానికి కారణం మోదీయేనని,





3వ పేజీలో...

# ఖమ్మం కన్నా బీహారే నయం

## పరాకాష్టకు బెదరింపు రాజకీయాలు

అహంకార నేతలను తరిమి కొట్టాలి
కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజలకు శాంతి
ఖమ్మం ప్రచారంలో మాజీమంత్రి తుమ్మల పిలుపు



ఖమ్మం, నవంబర్ 23 (సమ సమాజం): కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. గురువారం 39వ డివిజన్ రోడ్ షోలో తుమ్మల పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం కంటే బీహార్ నయం అనేలా పరిస్థితులు ఉన్నాయన్నారు. గోదావరి ఇసుక, కొండలు, భూ కబ్జాలతో ఖమ్మంలో అరాచకం పెట్రేగిపోయిందన్నారు. పేదల ఇళ్ల స్థలాల పట్టాలు అమ్ముకునే కార్పొరేటర్లు, స్మశానం కబ్జా చేసే కార్పొరేటర్ల అవినీతి పెరిగిపోయిందన్నారు. బెదిరించే నాయకులకు భయపడవద్దని.. ఆత్మగౌరవంతో అహంకార నేతలను తరమి కొట్టాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు పూయిస్తాయన్నారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. ఖమ్మంలోని శ్రీనివాస నగర్ టీచర్స్ కాలనీలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేరే ప్రాంతాల నుంచి వచ్చి అన్నదమ్ముల్లా కలిసి ఉన్న వారిని ఇబ్బంది పెట్టారన్నారు. 39వ డివిజన్‌లో తుమ్మల మాట్లాడుతూ.. ఖమ్మం కంటే బీహార్ నయం అనేలా పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. గోదావరి ఇసుక.. కొండలు భూ కబ్జాలతో ఖమ్మంలో అరాచకం చెలరేగుతోందన్నారు. పేదల ఇళ్ల స్థలాల పట్టాలు అమ్ముకునే కార్పొరేటర్లు... శ్మశానం కబ్జా చేసే కార్పొరేటర్ల అవినీతి పెచ్చుమీరిపోతోందన్నారు. కమ్మ, కాపు కులాల్లో కుంపట్లు మైనార్టీల్లో వర్గ పోరు పెట్టారన్నారు. అసోసియేషన్‌ల్లో చీలికలు ఛాంబర్ ఆఫ్ కామర్స్.. గ్రానైట్ అసోసియేషన్‌లో వర్గాలు చేసేలా కుట్రల రాజకీయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల పిలుపునిచ్చారు. కమ్మ, కాపు కులాల్లో కుంపట్లు, మైనార్టీల్లో వర్గ పోరు పెట్టారని మండిపడ్డారు. అసోసియేషన్‌ల్లో చీలికలు ఛాంబర్ ఆఫ్ కామర్స్, గ్రానైట్ అసోసియేషన్‌లో వర్గాలు చేసేలా కుట్రల రాజకీయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతమైన ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

బిఆర్‌ఎస్ అవినీతికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
మంథని ప్రచారంలో మాజీమంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



మంథని, నవంబర్ 23 (సమ సమాజం): రాష్ట్రంలో, దేశంలో వచ్చేది కాం గ్రెస్ ప్రభుత్వమేనని, త్వరలో రాష్ట్రంలో ఒకరు, దేశంలో మరొకరు కనుమరుగవుతారని మంథని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీమంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తన ప్రచారంలో ఆయన ప్రజలను కలుస్తూ నేరుగా ఓట్లు అభ్యర్థించారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సం దర్భంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన సమయంలో ఆరెస్సెస్, బీజేపీ ప్రజలను ఏ విధంగా విభజిస్తున్నాయో అర్థమైందని అన్నారు. విద్వేషాలు రగిలించే దేశం కాదు, ప్రేమను పంచే దేశమని చెప్పదల్చుకున్నానని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలపై సంతకం పెడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత కరెంట్‌ను అమలు చేస్తామన్నారు. 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లులు వసూలు చేయకుండా ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ సర్కారు వస్తే రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, పేద మహిళలకు బ్యాంకు అకౌంట్‌లో రూ.2500లు జమ చేస్తామని, రైతులకు ప్రతి ఏటా రూ. 15వేలు, ప్రతి వ్యవసాయ కార్మికునికి సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామని, గృహ నిర్మాణం కోసం రూ.5 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలపై దౌర్జన్యాలు, దోపిడీలు, భూకబ్జాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మంథనిలో తాను చేసిన అభివృద్ధి తప్ప ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలకు చేసింది ఏమిలేదని అన్నారు. తెలంగాణ తెచ్చామని చెబుతూ రెండు సార్లు మభ్యపెట్టి బీఆర్‌ఎస్ ఓట్లు వేయించుకొని ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు.

# కాళేశ్వరంతో లక్షకోట్లు వృథా

కామారెడ్డి ప్రచారంలో అర్వింద్ విమర్శలు



కామారెడ్డి, నవంబర్ 23 (సమ సమాజం): లక్ష కోట్లను కేసీఆర్ నీటి పాలు చేశారని బీజేపీ ఎంపీ అరవింద్ 9 వ్యాఖ్యానించారు. కాళేశ్వరంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందన్నారు. గురువారం నాడు గాంధారిలో బీజేపీ అభ్యర్థి సుభాష్ రెడ్డి తరఫున ఎంపీ అరవింద్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ..' కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌ను గెలిపించెందుకే రేవంత్‌రెడ్డి పోటీ చేస్తున్నాడు. కామారెడ్డిలో బీజేపీని ఓడించడానికి కుట్ర చేశారు. రేవంత్‌రెడ్డి, కవిత బిజినెస్ పార్టనర్స్. రేవంత్‌రెడ్డి నోట్ల కేసును బయటకు రాకుండా కేసీఆర్ కాపాడుతున్నాడు. ఎల్లారెడ్డిని కాషాయ మయంగా మార్చుదాం.మోదీ ఉచిత బియ్యం ఇస్తున్నారు. కేసీఆర్ మాత్రం రేషన్ కార్డులను ఇస్తాల్లేరు. రేవంత్‌రెడ్డి అమ్ముడు పోయాడు. నిజామాబాద్ జిల్లాలో బీజేపీ 5 సీట్లు గెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు నీతి లేదని అరవింద్ ఎద్దేవ చేశారు.

# సనాతన ధర్మం, సోషలిజం రెండు నడపగలిగేది ఒక్కటే జనసేన : పవన్




కొత్తగూడెం, నవంబర్ 23 (సమ సమాజం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: తాను తెలంగాణలో తిరగక పోయినా జనసేన ఉందంటే మీ అభిమానమేనని, తనది హ్యూమనిజమని, 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న' దాశరథీ కృష్ణమా చార్యులు అంటే తనకు స్ఫూర్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ తరఫున ఆయన గురువారం కొత్తగూడెం ప్రకాశం గ్రౌండ్స్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ.. సనాతన ధర్మం, సోషలిజం రెండూ నడప గలిగేది జనసేన అని, బీఆర్‌ఎస్‌ను ఒక్కమాట అనక పోవడానికి కారణం తాను ఇక్కడ తిరగక పోవడమేనని స్పష్టం చేశారు. దశాబ్దం వేచి చూసానని, ఆంధ్రాలో అరాచకంపై పోరాటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే తనకు స్ఫూర్తి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణలో అణగారిన వర్గాలకు జనసేన అండగా ఉంటోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వ పటిమ నచ్చి ఆయనకు మద్దతుగా ఉన్నానన్నారు. ఎవ్వరు వచ్చినా రాక పోయినా దక్షిణాది నుంచి మోదీకి మద్దతుగా ఉంటానని అన్నారు. భవిష్యత్తు యువత అని చెప్పిన గద్దర్‌కు జోహార్లని పవన్ అన్నారు. నిధులు నీళ్ళు నియామకాలు నినాదంతో వచ్చిన తెలంగాణలో అనుకున్న స్థాయిలో లేదని విమర్శించారు. తెలంగాణలో బీసీ నేతను ముఖ్యమంత్రి చేయగలిగేది మోదీ మాత్రమేనని, రెండు తెలుగు రాష్ట్రాల్లో నిత్యం ఎన్నికల వాతావరణం అవాంఛనీయమని అన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణిలో ఉద్యోగాలు రావాలన్నా పేపర్ లీక్స్ లేకుండా ఉండాలంటే బిజెపి రావాలన్నారు. వైఎస్ జల యజ్ఞం దోపిడీ వల్లే తెలంగాణ పోరాటానికికు పునాది పడిందని, కౌలు రైతులను.. రైతులు కాదనడం బాగో లేదన్నారు. ధరణిలో లోపాలున్నాయని, అభివృద్ధి ఆంధ్రాలో జరగక పోతే తెలంగాణ యువత నష్ట పోతుందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.

# అరాచక బీఆర్‌ఎస్ పాలనపై తీర్పు ఇచ్చే సమయం : విజయశాంతి



హనుమకొండ, నవంబర్ 23 (సమ సమాజం): అరాచక బీఆర్‌ఎస్ పాలనపై తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ మహిళా నేత విజయశాంతి అన్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి తరఫున విజయశాంతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆమె మాట్లాడారు. "భూ, మైనింగ్ మాఫియాను కేసీఆర్ ప్రోత్సహించారు. ప్రాజెక్టుల పేరుతో అవినీతి చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పేరుతో అవినీతికి పాల్పడ్డారు. టీఎస్‌పీఎస పేపర్ లీక్‌లో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే పరిస్థితికి వచ్చింది. ప్రజలు ఏమైపోయినా పర్వాలేదు... కేసీఆర్‌కు డబ్బే ముఖ్యం. లిక్కర్ స్కామ్‌లో ఇతరులను అరెస్టు చేశారు కానీ... కవితను అరెస్టు చేయలేదు. కేసీఆర్ కుటుంబం బరితెగించింది. అందరికీ చుక్కలు చూపించే నా వరంగల్ వాసులను కూడా కేసీఆర్ మోసం చేశారు. వరంగల్ వాసులు కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి. కేసీఆర్‌ను గద్దె దించాల్సిందే. ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వని స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను ఓడించాలి." అని విజయశాంతి పిలుపునిచ్చారు. "సంక్షేమం అంటేనే కాంగ్రెస్. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్. బీజేపీ వాళ్లు సామదాన దండోపాయాలు ఉపయోగించి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తేవాలని చూస్తున్నారు. అవినీతి కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా బీజేపీ కాపాడుతోంది. బీఆర్‌ఎస్-బీజేపీ తోడు దొంగలు." అని విజయశాంతి విమర్శించారు.

# కల్యాణమస్తు, షాదీతోఫా నిధుల విడుదల




అర్హులైన 10,511 జంటలకు రూ.81.64 కోట్ల ఆర్థిక సాయం♦పేదలను ఆదుకునేలా కార్యక్రమం అమలు♦ఇదో మంచి కార్యక్రమమని సిఎం జగన్ వెల్లడి

అమరావతి, నవంబర్ 23 (సమ సమాజం): వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులను సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయంలో గురువారం బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ ఏడాది జులై - సెప్టెంబర్ త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,511 జంటలకు రూ.81.64 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, కులాంతర వివాహం చేసుకున్న ఎస్సీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహం చేసుకున్న బీసీలకు రూ.75 వేలు అందజేశారు. చదువులకు మరింత ఊతమిస్తూ... వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా విడుదల చేశారు. జూలై- సెప్టెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన 10,511 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా క్రింద రూ.81.64 కోట్ల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి సీఎం వైయస్.జగన్.బీసీ తల్లుల ఖాతాల్లో జమ చేసారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. దేవుడి దయతో మరోమంచి కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేయగలుగుతున్నాం. పేదతల్లిదండ్రులు తమ పిల్లలను గొప్పగా చదవించి, వారికి గౌరవప్రదంగా పెళ్లిళ్లు చేసి, వారి వివాహ జీవితాలను మొదలు పెట్టించేందుకు సహాయంగా ఉండే మంచి కార్యక్రమం ఇవాళ జరుగుతుంది. చేయిపట్టుకుని నడిపిస్తున్నాం. పేద వర్గాలైన ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు అందరినీ ప్రతి సందర్భంలో నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ అంటూ వారి మీద ఓనర్ షిప్ తీసుకుంటూ, వాళ్లంతా ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన వాళు అంటూ భరోసా ఇస్తూ, చేయి పట్టుకుని నడిపిస్తున్నాం. 10,511 జంటలకు రూ.81.64 కోట్ల లబ్ధి.ఈ రోజు ఈ పథకం ద్వారా జూలై నుంచి సెప్టెంబర్ దాకా జరిగిన పెళ్లిళ్లకు సంబంధించి 10,511 మంది జంటలను ఆశీర్వదిస్తూ వారికి ఇవాళ రూ. 81.64 లక్షల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నాం.ఈ పథకంలో ఇప్పటి వరకు 3 త్రైమాసికాల్లో మూడు విడతల్లో ఈ ఆర్థిక సాయం అందించాం. 2022 అక్టోబర్ నుంచి మొదలు పెడితే ఇవాళ్టికి.. ఈరోజు ఇస్తున్న నాలుగో విడతతో కలిపి మొత్తం 46,062 జంటలకు రూ.349 కోట్లు ఆ తల్లుల ఖాతాల్లోకి జమ చేయడం జరుగుతోంది. గతానికీ నేటికీ తేడా.గత ప్రభుత్వంలో ఈ పరిస్థితి ఎలా ఉండేదని ఒక్కసారి బేరీజు వేసుకుంటే కొన్నివిషయాలు ఆశ్చర్యకరంగా అనిపిస్తాయి. గత ప్రభుత్వం ఏనాడూ నిజాయితీతో, చిత్తశుద్ధి తో ఒక మంచి పథకం తీసుకురావాలని, దానివల్ల పేదవాళ్లకు మంచి జరగాలని అడుగులు పడలేదు.ఒక పథకం తీసుకొస్తే ఒక ఉండాలి. ఆ ఉద్దేశం, సంకల్పం మంచిదైతే దేవుడు ఆ సంకల్పాన్ని ఆశీర్వదిస్తాడు. చేసే మంచి మనసుని ఆశీర్వదిస్తాడు. పరిస్థితులు దాన్ని చేయడానికి అన్ని రకాలుగా కలిసి వస్తాయి. అటువంటి మంచి సంకల్పంతో అడుగులు ముందుకు వేసిన పథకం ఈ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకం. ఓట్లు కోసం కాదు- విజన్‌తో అడుగులు.ఈ పథకం ప్రకటించేటప్పుడు ఎందుకు పదో తరగతి సర్టిఫికెట్, 18 సంవత్సరాలు తప్పని సరని నాతో చాలా మంది అన్నారు. అందరికీ ఇస్తే ఎక్కువ ఓట్లు వస్తాయన్నారు. నేను ఒకటే అన్నాను. ఓట్లు అన్నది, ఎన్నికలన్నవి సెకండరీ. లీడర్లుగా మనం ఉన్నప్పుడు మన సంకల్పం మంచిదై ఉండాలి. విజన్ మోస్ట్ ఇంపార్టెంట్. ఈరోజు మనం వేసే ప్రతి అడుగులోనూ విత్తనం వేస్తున్నాం. ఈరోజు ఇదొక ప్రేరణ అంశం కావాలి. 10వ తరగతి సర్టిఫికెట్, 18 ఏళ్లు వధువుకు, 21 ఏళ్లు వరుడికి కనీస వయస్సు ఉండాలని చెబుతామో.. దానివల్ల బాల్య వివాహాలు పూర్తిగా తగ్గిపోవడమన్నది వాస్తవరూపం దాల్చుతుంది. ఇదొక పరిష్కారం.రెండోది 10వ తరగతి సర్టిఫికెట్ తప్పనిసరి చేయడం వల్ల ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదివించేందుకు మరింత ఊతం ఇస్తుంది. అమ్మఒడి అనే పథకం ఇప్పుడు ప్రతి తల్లిని మోటివేట్ చేయిస్తూ... తమ పిల్లలను చదివించే విధంగా అడుగులు వేయిస్తుంది.విద్యా వ్యవస్థ-సమూల మార్పులు.ఇప్పుడు గవర్నమెంట్ బడుల రూపురేఖలు మారుతున్నాయి. వాటిలో ఇంగ్లీషు మీడియం చదువులు వచ్చాయి. నాడు నేడుతో రూపురేఖలు మారుతున్నాయి. 6వ తరగతి నుంచి ఏకంగా డిజిటల్ బోధనను క్లాస్‌రూమ్‌లోనే అందుబాటులోకి తీసుకువస్తూ.. ఐఎఫ్‌పీల బోధన కూడా అందుబాటులోకి వచ్చింది. 3వ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్స్, బైలింగువల్ టెక్స్ట్‌బుక్స్‌తో పిల్లలు గొప్పగా ఎదగాలని తాపత్రయపడుతూ అడుగులు వేస్తున్నాం. తల్లులనూ మోటివేట్ చేస్తూ...వీటన్నింటికీ తోడుగా పిల్లలను బడులకు పంపేవిధంగా... తల్లులను మోటివేట్ చేస్తూ అమ్మ ఒడి తెచ్చాం. దీనివల్ల తల్లులు తమ పిల్లలను బడులకు పంపేలా మోటివేట్ అవుతున్నారు. 10వ తరగతి సర్టిఫికెట్ తప్పనిసరి చేయడం వల్ల కచ్చితంగా పదో తరగతి వరకు చదువుతారు. 18 సంవత్సరాల వరకు ఆగాలి, అమ్మ ఒడి వర్తిస్తుంది కాబట్టి పిల్లలను ఇంటర్ కూడా చదివిస్తారు.దానివల్ల తల్లిదండ్రులకు నష్టం లేదు. అమ్మ ఒడి ద్వారా ఆదాయం వస్తుంది. ఒక్కసారి ఇంటర్ వరకు పిల్లలను చదివించాక.. ఆ తర్వాత విద్యా దీవెన, వసతి దీవెన అందుబాటులో ఉన్నాయన్నది మెదడుకు తడుతుంది.అప్పుడు విద్యాదీవెన వీటి ద్వారా పూర్తి ఫీజు అందుతుందని, రూపాయి కూడా ఖర్చు లేకుండా పిల్లలను చదివించగలమని తడుతుంది. అంతే కాకుండా కాలేజీలలో పిల్లలను చేరిస్తే... వసతి దీవెన కింద రూ.20 వేల వరకు సంవత్సరానికి వస్తుందన్నది తడుతుంది. అప్పుడు పిల్లల్ని గ్రాడ్యుయేషన్ వరకు చదివించేందుకు తల్లిదండ్రులు మోటివేట్ అవుతారు.అప్పుడు గ్రాడ్యుయేట్స్ అయ్యే దాకా పిల్లలను తీసుకుపోయే కార్యక్రమం జరుగుతుంది. ఒక్కసారి పిల్లలు గ్రాడ్యుయేట్ స్థాయిలోకి చదివించగలగడం వల్ల అప్పుడు జనరేషన్ చేంజ్ వస్తుంది. చదువు-పిల్లల తలరాతలు మార్చే అస్త్రం.చదువు అనే అస్త్రంతో పిల్లల తలరాతలు మార్చే గొప్ప వ్యవస్థ పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లలు పేదరికం నుంచి బయటపడే గొప్ప పరిస్థితి కూడా ఏర్పడుతుంది.

# హైదరాబాద్‌లో 5కోట్ల నగదు పట్టివేత



హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం): గచ్చిబౌలి లో భారీగా నగదు పట్టుబడింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కోట్ల నగదును మాదాపూర్ ఎవోటి గచ్చిబౌలి పోలీసులు సిజ్ చేశారు. కొండాపూర్ బొటానికల్ రోడ్ నుండి చిరాక్ పబ్లిక్ స్కూల్ పైపు బ్రీజా కార్లో నగదును గుర్తుతెలియని వ్యక్తులు తరలిస్తుండగా పట్టుకున్నారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా కారులో రెండు సంచుల్లో ఐదు కోట్ల రూపాయల నగదును పోలీసులు గుర్తించారు. పట్టు పడ్డ నగదు ఓ వ్యాపారవేత్తకు సంబంధించినదిగా గుర్తించారు. అట్టి నగదును ఐటి శాఖ అధికారులకు పోలీసులు అప్పగించారు.

# సజావుగా తెలంగాణ ఎన్నికల నిర్వహణ

(మొదటి పేజి తరువాయి) చేసిన మీడియాతో మాట్లాడుతూ ఈసారి మొదటిసారి ఇంటి నుంచే ఓటింగ్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు. యువ ఓటర్లు 9 లక్షలకు పైగా ఉన్నారని, పోస్టల్ బ్యాలెట్లు 4లక్షలు, ఈవీఎం బ్యాలెట్లు 8 లక్షల 84వేలు ప్రింట్ చేసినట్లు పేర్కొన్నారు. ఎపిక్ కార్డులు 51 లక్షలు ప్రింట్ అయ్యి దాదాపు పంపిణీ అయ్యాయి. రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులు వచ్చినట్లు ప్రతి లెక్కింపు కేంద్రంకు ఒక పరిశీలకులు ఉంటారని వెల్లడించారు. మూడు కేటగిరీల్లో ఇంటి వద్దే ఓటింగ్ విధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 ఏళ్లు పైబడిన వాళ్లు 9300 మంది ఓటు హక్కును వినియోగించు కున్నట్లు 2 కోట్ల 81లక్షల ఓటర్ గుర్తింపు పత్రాల పంపిణీ పూర్తి అయినట్లు రేపటి వరకు ఓటర్ స్లిప్ పంపిణీ పూర్తి అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 35,655 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు 59వేల బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నట్లు చెప్పారు. సీ విజిల్ యాప్ ద్వారా 6,600 ఫిర్యాదులు అందినట్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు జిపిఎస్ ఉంటుందని, ప్రతి నియోజకవర్గానికి మూడు ఎస్ఎస్టీ, ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు



లేకుండా ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలంగాణలో ఎన్నికల కోసం 377 కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం గతంలో తక్కువగా ఉందని 3 లక్షల మంది పోలింగ్ ఏర్పాట్లలో పాల్గొంటున్నారు. డీఏ గురించి ప్రతిపాదనలు వచ్చియని నిర్ణయం ఈసీఐ ఇంకా తీసుకోలేదన్నారు. 64 వేల మంది రాష్ట్ర పోలీసులు, 375 కేంద్ర కంపెనీల నుంచి బలగాలు ఎన్నికల కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో శాంతి భద్రత సమస్య ఎక్కడ లేదన్నారు. 114 గుర్తింపు పొందిన పార్టీలు రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు.

## ఉమ్మడి నిజామాబాద్‌లో స్వీప్ చేస్తాం



కాంగ్రెస్, బిజెపిలకు ఇక్కడ డిపాజిట్లు దక్కవు ● కెసిఆర్‌పై రేవంత్ విమర్శలు అర్ధరహితం: వేముల

నిజామాబాద్, నవంబర్ 23 (సమ సమాజం): ఇది బీఆర్ఎస్ అభివృద్ధికి, కాంగ్రెస్ అరాచకానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలో అధికార బిఆర్ఎస్ స్వీప్ చేయబోతున్నేదని, కామారెడ్డిలో కాంగ్రెస్, బిజెపిలకు డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. కెసిఆర్ ముందు కుప్పిగంతులు వేస్తున్న రేవంత్‌కు ప్రజలు తగిన గుణపాఠం తప్పదన్నారు. జిల్లాలో బిఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పిట్ట బెదిరింపులకు భయపడేవాళ్లు ఎవరూ లేరని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మనుగడ లేదన్నారు. బోధన్ లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. 80 సీట్ల కంటే ఒక్కటి తక్కువగా వచ్చినా ఏదంటే అది చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నారని, ఇలాంటి సవాళ్లను 10 సార్లు చేశారని, కొడంగల్ లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గత ఎన్నికల్లో అన్నారని మంత్రి వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా రెండు మూడు నెలలకే ప్రభుత్వం అస్థిరమైతుందని స్పష్టం చేశారు. కర్నాటకలో అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే కుమ్ములాటలు మొదలయ్యాయని చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం జిల్లాలకు ఐటీ రంగాన్ని విస్తరిస్తోందని, కానీ ఆనాడు కాంగ్రెస్ పార్టీ జిల్లాలకు అల్లర్లను విస్తరించిందని మండిపడ్డారు. ఎవరు ఏం చేస్తారో చేసుకోండి అన్నట్లు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లాకు వచ్చిన రేవంత్ రెడ్డి కొంత బాధ్యతగా మాట్లాడుతారని అంతా అనుకున్నారని కానీ కెసిఆర్‌ను ఇష్టం వచ్చినట్లుగా విమర్శిస్తున్నారని వివరించారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని, దాన్ని జీర్ణం చేసుకోలేక తమ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలపై భౌతిక దాడికి దిగడం చాలా హేయమైన అంశమని అన్నారు. కాంగ్రెస్ నేతలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. తమ పార్టీ నిజామాబాద్ రూరల్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్ పై మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. బాజీరెడ్డి ఆర్టీసీ చైర్మన్ గా ఉన్న సమయంలోనే ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశామని, ఉల్టా ఆర్టీసీ ఉద్యోగులకు అన్యాయం చేసినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని స్పష్టం చేశారు. ఎస్సారెస్పీని చూపించి ఓట్లు అడుగుతాం బీఆర్ఎస్ ఏం చూపించి ఓట్లు అడుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారని, నిజామాబాద్ జిల్లాకు వచ్చి రేవంత్ రెడ్డి చూడాలని, గత కంటే మూడురెట్ల ఆయకట్టు పెరిగిందని స్పష్టం చేశారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకు నీళు ఇస్తున్నదని సీఎం కేసీఆర్ అని, కాబట్టి ఎస్సారెస్పీ గురించి మాట్లాడే అధికారం, హక్కుకాంగ్రెస్ పార్టీకి లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీకి నిజామాబాద్ జిల్లాలో ఓటు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు.

## ప్రచారంలో కాంగ్రెస్ దూకుడు



(మొదటి పేజి తరువాయి) జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తుంది. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన జాతీయ స్థాయి అగ్రనేతలు వరుసగా ప్రచార పర్వంలో జోరు చూపిస్తున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తెలంగాణలో ప్రచారం చేశారు. ప్రియాంక గాంధీ తెలంగాణలో మలివిడత ప్రచారంలో పాల్గొననున్నారు. ప్రియాంక గాంధీ ఈ నెల 24వ తేదీ నుంచి ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు ప్రియాంక గాంధీ పర్యటన ఖరారయింది. ప్రియాంక గాంధీ 10 నియోజకవర్గాలల్లో ప్రచారం చేయనున్నారు. 24వ తేదీన ఉదయం 11గంటలకు పాలకుర్తిలో ప్రియాంక సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హుస్నాబాద్, సాయంత్రం 4గంటలకు ధర్మపురిలో సభలో ప్రసంగిస్తారు. 25వ తేదీన పాలేరు, ఖమ్మం, వైరా, మధిర నాలుగు నియోజకవర్గాలలో ప్రియాంక గాంధీ ప్రచారం చేయనున్నారు. నేడు కొత్తగూడెం రోడ్ షోలో ప్రియాంక గాంధీ, సీపీఐ నేత డి.రాజా పాల్గొననున్నారు. కొత్తగూడెంలో ప్రియాంక గాంధీ రోడ్ షోలో పాల్గొననున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో, ప్రజా భేరి సభలో ప్రియాంక గాంధీ, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పాల్గొననున్నారు. ఓల్డ్ డిపో నుంచి త్రీ టౌన్ వరకు రోడ్ షో నిర్వహించనున్నారు. రేపు రాత్రి ఖమ్మంలో ప్రియాంక గాంధీ బస చేయనున్నారు. ఎల్లుండి పాలేరు, ఖమ్మం వైరా, మధిర నియోజకవర్గాలల్లో ప్రియాంక గాంధీ ప్రచారం చేయనున్నారు.

## కెసిఆర్ కుటుంబ పాలనను తరిమి కొడదాం

### గజ్వేల్ ప్రచారంలో ఈటెల రాజేందర్ పిలుపు



సిద్దిపేట,నవంబర్ 23 (సమ సమాజం): నా మొఖం అసెంబ్లీ లో కనిపించవద్దని కేసీఅర్ నాపై ఎన్నో కోట్లు ఖర్చు పెట్టిండని మాజీమంత్రి, బిజెపి నేత ఈటెల రాజేందర్ అన్నారు. కేసీఆర్ హుజూరాబాద్‌కు వస్తే నీ మొఖం చెల్తదా ..నా మొఖం చెల్తదో రా అని అంటే రాలేదు కాబట్టి నేనే గజ్వేల్‌కు వచ్చిన అని చెప్పుకొచ్చారు. జిల్లాలోని గజ్వేల్ మండలం జాలిగామ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎక్కడెక్కడ లీడర్ ఉంటడో అక్కడ భారతీయ జనతా పార్టీ ఉంటదని దుబ్బాక ప్రజలు నేర్పించారన్నారు. బీజేపీ అధికారం లో వచ్చిన వెంటనే వడ్లకి మద్దతు ధరగా క్వింటాలుకు రూ.3100లు చేస్తామని హామీ ఇచ్చారు. రూపాయి ఖర్చు కాకుండా కార్పొరేట్ వైద్యం అందించే జుమ్మేదారి కోసమే ఓట్లు అడుగుతున్నామని ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత, రాష్ట్ర సంపద అంతా కల్వకుంట్ల కుటుంబానికి చేరిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ రూ. లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌ను కూకటివేళ్లతో పెకిలించడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. అవినీతికి పరాకాష్ట కేసీఆర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన కొనసాగుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ నుంచి విముక్తి చేస్తామని, తెలంగాణలో బీఆర్ఎస్‌ను గెలిపించడం కోసం కాంగ్రెస్ పనిచేస్తున్నదని, అన్నారు.

# సమ్మిళిత, సమగ్ర అభివృద్ధి లక్ష్యం

(మొదటి పేజి తరువాయి) తెలిపారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణలో అతి తక్కువ కాలంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపామని అన్నారు. ఐటీసీ కాకతీయ హోటల్‌లో తెలంగాణ అభివృద్ధిపై ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ తెలంగాణ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..టీఎస్ ఐపాస్, టీఎస్ బీ పాస్ మీకు తెలుసు. ఈ రెండింటి ద్వారా సింగిల్ విండో విధానంలో పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నాం. కొత్త మున్సిపాలిటీ, కొత్త పంచాయతీ చట్టాలను తెచ్చి పారదర్శకంగా అమలు చేస్తున్నాం. టీఎస్ ఐపాస్ ద్వారా 24 వేల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చాం. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 24 లక్షల మందికి ఉపాధి కల్పన జరిగింది. ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు హైదరాబాద్ చిరునామాగా మారింది. గూగుల్, ఆపిల్, అమెజాన్, మెటా వంటి తదితర కంపెనీలకు నిలయంగా మారింది. ఐటీ ఎగుమతులు 57 వేల కోట్ల నుంచి 2.41 లక్షల కోట్లకు చేరాయి. ఐటీ ఉద్యోగాలు 3 లక్షల నుంచి 9 లక్షలకు చేరాయి. ద్వితీయ శ్రేణి పట్టణాలైన వనపర్తి, నల్లగొండ, మహబూబ్‌నగర్, సిద్దిపేట, సిరిసిల్ల, నిజామాబాద్ వంటి పట్టణాలల్లో ఐటీ కంపెనీలు నెలకొల్పాం. ఇదంతా సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైంది అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ తొమ్మిదిన్నరేండ్ల కాలంలో తెలంగాణ ప్రభుత్వం 1,60,083 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మరి కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎంత..చెప్పే దమ్ముందా..అని ప్రతిపక్షాలకు కేటీఆర్ సవాల్ విసిరారు. గత పదేండ్లలో ప్రభుత్వ రంగంలో 1,60,083 ఉద్యోగాలు భర్తీ చేశాం. మరో 42 వేల ఉద్యోగాలు భర్తీ ప్రక్రియలో ఉన్నాయి. మా కంటే మెరుగ్గా ఉద్యోగాలు భర్తీ చేసిన రాష్ట్రాలు ఉన్నాయా..? ఉంటే తెలంగాణ పిల్లలకు చెప్పండి. ఊరికే గావుకేకలు, పెడబొబ్బలు కాదు. ఈ విధంగా ప్రజెంటేషన్ ఇవ్వండి. ఫలానా చోట ఇంత కన్న ఎక్కువ చేశామని చెప్పండి. గుజరాత్‌లో 6 కోట్ల జనాభా ఉంది. రాజస్థాన్‌లో ఎనిమిదిన్నర కోట్లు, కానీ ఈ రాష్ట్రాల్లో ఉద్యోగాల భర్తీ అనుకున్నంత జరగలేదు. మనం 4 కోట్ల జనాభాకు 1.60 లక్షల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఎనిమిదిన్నర కోట్లు, 6 కోట్ల జనాభా ఉన్న రాష్ట్రాలు కూడా అన్ని ఉద్యోగాలను భర్తీ చేయలేదు. వాళ్లొచ్చి మమ్మల్ని మాట్లాడుతున్నారు. ఇవి వాస్తవాలు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి వెబ్‌సైట్ కూడా పబ్లిష్ చేశాం. వాస్తవాలు ఇవి. కాదని రుజువు చేసే దమ్ము ప్రతిపక్షాలకు ఉందా..? అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తేసి, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తారట.. పట్వారీ వ్యవస్థ అంటేనే దళారీ వ్యవస్థ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తేల్చిచెప్పారు. తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి చెందిందని మంత్రి కేటీఆర్ అన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. కేసీఆర్ వచ్చిన తర్వాతే కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయని చెప్పారు. తలసరి ఆదాయంలో తెలంగాణ నంబర్ రాష్ట్రంగా నిలిచిందని, జీఎస్‌డీపీలో అత్యంత వేగంగా పెరుగుతున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. పచ్చని పంటలతో కళకళలాడు తున్నదని వెల్లడించారు. 2014కు ముందు ఎట్లుండే తెలంగాణ 2023లో ఎట్లైంది తెలంగాణ అని గణాంకాలు, ఫొటోలతో వివరించారు. 'తెలంగాణలో పంటల దిగుబడి పెరింది. ధాన్యం ఉత్పత్తిలో అన్నపూర్ణగా మారింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగు నీటిని అందిస్తున్నాం. దీనికోసం కోసం రూ.37 వేల కోట్లు ఖర్చు చేశాం. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా 58 లక్షల కుటుంబాలకు నీరు అందిస్తున్నాం. ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయి. దీని స్ఫూర్తితో కేంద్రం ప్రభుత్వం హర్ ఘర్ జల్ పథకాన్ని ప్రారంభించింది. ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించాం. దీంతో ప్రతి గ్రామంలో చెరువులు నిండు కుండలా కనిపిస్తున్నాయి. సాగునీరు రావడంతో సంపద సృష్టించబడింది. నీళ్లు, నిధులు, నియామకాలకు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ న్యాయం చేసింది. మన ఊరు-మన బడి కార్యక్రమంతో పాఠశాలలను బలోపేతం చేశాం. 26 వేలకుపైగా స్కూళ్లను అభివృద్ధి చేశాం. ప్రతి జిల్లాలోనూ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశాం. 56 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏర్పాటుచేసిన కాలేజీలు రెండే. గతంలో ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలు మాత్రమే ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ పాలనలో 34 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశాం. రూ.12 వందల కోట్లతో యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేశాం. దశలవారీగా ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. రైతును రాజును చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు తగ్గాయని కేంద్ర ప్రభుత్వమే చెప్పింది. సాగుకు 24 గంటల కరెంటు ఇచ్చే ఏకైక రాష్ట్రం తెలంగాణ. నల్లగొండలో ఫ్లోరోసిస్ లేకుండా చేశాం. సౌర విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ రెండో స్థానంలో ఉంది. గ్రామ పంచాయతీలకు మౌలిక సదుపాయాలు కల్పించాం. సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.లక్షా 70 వేల కోట్లు ఖర్చు చేశాం. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరాన్ని నాలుగున్నరేండ్లలో పూర్తిచేశాం. కాళేశ్వరం అంటే 3 బ్యారేజీలు, 20 రిజర్వాయర్లు, 20 లిఫ్టులు. కాల్వలు తవ్వి పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేశాం. ప్రాజెక్టులపై రాజకీయాలు చేయొద్దు. ప్రాజెక్టులను బద్నాం చేసి అన్యాయం చేయొద్దు. బ్యారేజీల్లో సమస్యలు రావడం సర్వ సాధారణం. ప్రకాశం, ధవళేశ్వరం, కడెం జలాశయాల్లోనూ సమస్యలు వచ్చాయి. సాగర్ కట్టిన తర్వాత కూడా లీకేజీ సమస్యలు వచ్చాయి. రెండేండ్ల క్రితం శ్రీశైలం పంపులు కూడా నీటమునిగాయి. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయొద్దు. కేంద్రంలో దుర్మార్గమైన ప్రభుత్వం ఉన్నది. తెలంగాణకు అప్పులు పుట్టకుండా కుట్ర చేస్తున్నది. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే.. కరెంటు ఉండదు' అని మంత్రి కేటీఆర్ అన్నారు. గతంలో తెలంగాణలో ఒక రైతు భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే చేయి తడపనిదే రిజిస్ట్రేషన్ అయ్యేది కాదు. అంతేకాదు ఎప్పుడు రిజిస్ట్రేషన్ అవుతదో, మ్యుటేషన్ ఎప్పుడు అయితదో తెలవని పరిస్థితి. మన చేతుల్లో ఏం ఉండేది కాదు. వాళ్ల దయ మన ప్రాప్తం. ధరణి వచ్చిన తర్వాత అన్ని లేయర్స్ పోయాయి. వీఆర్వో, వీఆర్ఏ, ఎమ్మార్వో, ఆర్డీవో, జాయింట్ కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, రెవెన్యూ సెక్రటరీ, రెవెన్యూ మినిస్టర్ ఇలా ఎనిమిది లేయర్స్ తీసేశాం. ధరణి ద్వారా రైతుల వేలి ముద్రకు అధికారం ఇచ్చింది బీఆర్ఎస్ గవర్నమెంట్. మీ భూమి రికార్డును ఎవరూ ట్యాంపర్ చేయకుండా మీకు అధికారం ఇచ్చారు. ధరణి తీసుకొచ్చింది కేసీఆర్. ధరణిలో లోటుపాట్లు ఉండొచ్చు. మేం లేవు అనట్లేదు. కానీ ఇవాళ భూమాత అని తెస్తున్నారు. తిరిగి పట్వారీ వ్యవస్థను తీసుకొస్తామని చెబుతున్నారు. పట్వారీ వ్యవస్థ అంటేనే దళారీ వ్యవస్థ. పట్వారీ వ్యవస్థను తీసుకొచ్చిన వారిని ఆశీర్వదిద్దామా.? లేదా ధరణి తెచ్చి, భూముల రిజిస్ట్రేషన్ లో పారదర్శకత తెచ్చిన వారిని ఆశీర్వదిద్దామా ప్రజలు ఆలోచించాలి అని కేటీఆర్ సూచించారు. తొమ్మిదిన్నర ఏళ్లలో జరిగిన అభివృద్ధి పై మీకు చెప్పాల్సిన అవసరం ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. ఈ తొమ్మిదిన్నరేళ్ల కాలంలో తెలంగాణ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రెవెన్యూ మండలాలూ, రెవెన్యూ డివిజన్ల సంఖ్య భారీగా పెంచామన్నారు. అతి తక్కువ ఉన్న మున్సిపాలిటీల సంఖ్య కూడా పెరిగింద న్నారు. కొత్త జిల్లాలు పెంచుకున్నామన్నారు. తండాలను గ్రామ పంచాయతీలు చేసుకున్నామన్నారు. రాష్ట్ర తలసరి ఆదాయం 2014 లో 1, 24, 104 ఉన్న ఆదాయం ఇప్పుడు 3,17,115 పెరిగిందని కేటీఆర్ అన్నారు. జీఎస్‌డీపీలో 13.27 లక్షల కోట్లకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ లో పేదరికం 13.18 శాతం నుంచి 5.8?కు తగ్గిందన్నారు. పంట దిగుబడి 2014 కు ముందు 68 లక్షల టన్నులు ధాన్యం ఉత్పత్తి కానీ ఇప్పుడు 3.5 లక్షల టన్నుల దాన్యం ఉత్పత్తి అవుతోందన్నారు. 37 వేల కోట్లతో 58 లక్షల ఇళ్లకు మంచినీళ్ళు అందించామన్నారు. ఇంటింటికి మంచినీళ్లు అందించి తెలంగాణ దేశంలో నంబర్ 1 స్థానంలో ఉందన్నారు. మిషన్ కాకతీయతో 46 వేల చెరువులు బాగు చేసుకున్నామని కేటీఆర్ తెలిపారు.

## హైదరాబాద్‌లో చిరుజల్లులు



హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం): హైదరాబాద్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గురువారం ఉదయం నుంచి నగరంలో ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉన్నది. దీంతో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నాయి. కర్మన్‌ఘాట్, చంపాపేట్, సంతోష్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక, పాతబస్తీ, జియాగూడ, మెహదీపట్నం, అమీర్‌పేట, ఎస్సానగర్, కూకట్‌పల్లి, బేగంపూట, సికింద్రాబాద్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లో వర్షం కురుస్తున్నది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గురువారం నుంచి ఈ నెల 26 వరకు వానలు కురుస్తాయని పేర్కొంది. ఈనేపథ్యంలో డీఆర్ఎఫ్, మున్సిపల్ సిబ్బందిని జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం వల్ల రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## ఢిల్లీలో మాకు బాస్‌లు లేరు... ప్రజలే మాకు బాస్‌లు




(మొదటి పేజి తరువాయి) సభలో కేసీఆర్ పాల్గొని, మహిపాల్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. పారిశ్రామిక కార్మికులకు మనవి చేస్తున్న. కాంగ్రెస్ రాజ్యం ఎట్ల ఉండే.. మన రాజ్యం ఎట్ల ఉంది. ఆనాడు కరెంట్ లేదు, మంచి నీళ్లు, సాగునీళ్లు లేవు. రాష్ట్రమంతా కూడా పెద్ద బాధ, రైతుల ఆత్మహత్యలు, చేనేతల ఆకలిచావులు, బతుకపోయి వలసపోయిన బిడ్డలు. మహబూబ్‌నగర్, నారాయణ్‌ఖేడ్ ప్రాంతాలకు చెందిన ప్రజలు.. ఎండాకాలం వస్తే హైదరాబాద్ బతుకుపోవుడు ఇదంతా మీరు చూశారు అని కేసీఆర్ తెలిపారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో కాంగ్రెస్ రాజ్యంలో ఎన్నడూ కూడా కరెంట్ సక్కగా రాకపోవు. నాకు చాలా మంది కార్మికులు చెప్పారు. 24 గంటల కరెంట్ వల్ల రెండు షిఫ్టుల్లో పని చేసుకుంటున్నాం అని చెప్పారు. పది రూపాయాలు మిగిలించుకొని మా ఇండ్లకు పంపుతున్నామని చెబుతున్నారు. నాణ్యమైన 24 గంటల కరెంట్ రావడం వల్ల ఆ యజమానులు ఉత్పత్తి పెంచుతున్నరు. వాళ్లు లాభపడుతున్నరు. డబుల్ డ్యూటీలు చేసుకుని కార్మికులు సంపాయించుకుంటున్నారు. ఇది ఇంకా పెరుగుతది. ఎవరు ఆపిన ఆగదు. పాశమైలారంలో కూడా కామన్ ట్రీట్‌మెంట్ ఎ÷-లాంట్లు పెట్టి అక్కడ కూడా కాలుష్యాన్ని తగ్గిస్తున్నాం అని కేసీఆర్ స్పష్టం చేశారు. మీరు హైదరాబాద్‌లో అంతర్భాగం అయ్యారు కాబట్టి మీ గురించి నిరంతరం ప్రభుత్వంలో ఆలోచనలు జరుగుతూనే ఉంటాయి. కాలుష్య రహిత పరిశ్రమలకు నిలయంగా చేసుకుని ఈ పటాన్‌చెరును బాగా అభివృద్ధి చేసుకుందాం. ఇంతకు ముందు ఇక్కడ ఓట్ల సంఖ్య 2 లక్షలు ఉండే. ఇవాళ 4 లక్షలకు పోయింది. వీళ్లంతా దేశం మొత్తం నుంచి వచ్చారు. గతంలో నేను వచ్చినప్పుడు ఆర్డీవో ఆఫీసు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, ఒక ఐటీఐ కాలేజీ కావాలని కోరారు. తెల్లారే జీవో ఇచ్చాం. ఆఫీసులన్నీ వచ్చేశాయి. బీఆర్ఎస్ పార్టీ ఢిల్లీకి గులాం కాదు. ఢిల్లీలో మాకు ఎవడూ బాస్ ఉండడు. తెలంగాణ ప్రజలే మాకు బాసులు. మమ్మల్ని ఎవరూ నిర్దేశిస్తారు..? మాకు ఆదేశం ఎవరు ఇస్తారు..? మీరే ప్రజలు ఇస్తరు. నేను ఆరో జు వచ్చాను. మీరు కోరారు. తెల్లారే మంత్రి హరీశ్‌రావు జీరో జారీ చేసి పంపించారు. ఈ రకంగా అన్ని పనులు కూడా ఉంటాయని కేసీఆర్ పేర్కొన్నారు.

## మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యలు




(మొదటి పేజి తరువాయి) ఆయన రావడం వల్లే గెలుచుకోలేకపోయామని అన్నారు. ప్రధాని మోదీ పిక్‌పాకెట్ అని కూడా విమర్శించారు రాహుల్. దీనిపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుని పరిగణనలోకి తీసుకున్న ఈసీ రాహుల్ గాంధీకి నోటీసులు పంపింది. నవంబర్ 25లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కామెంట్స్‌పై బీజేపీ సీనియర్ నేతలంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అభ్యంతరకరమైన భాషను వాడడం ఏ మాత్రం సరికాదని, చర్యలు తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని ఎన్నికల సంఘం నోటీసులో పేర్కొంది.

# మోడీ, అమిత్‌షాల వల్లనే మ్యాచ్ ఓడాం



(మొదటి పేజి తరువాయి) మమతా బెనర్జీ వరల్డ్ కప్ ఎ÷నైల్ మ్యాచ్ గురించి ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వరల్డ్ కప్‌లో ఇండియా అన్ని మ్యాచ్‌లు గెలిచిందని, ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా హాజరైన ఫైనల్ మ్యాచ్ మాత్రం ఓడిపోయిందని అన్నారు. వాళ్లు రావడం వల్లే భారత్ కప్ గెలుచుకోలేకపోయిందని విమర్శించారు. మోదీ, అమిత్‌షా లాంటి పాపాత్ములు రావడం వల్లే మ్యాచ్ ఓడిపోయిందని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోల్‌కత్తాలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడే సమయంలో ఈ కామెంట్స్ చేశారు. గుజరాత్‌లో కాకుండా కోల్‌కత్తాలోనే, ముంబయిలోనో ఎ÷నైల్ మ్యాచ్ పెట్టి ఉంటే కచ్చితంగా ఇండియా వరల్డ్ కప్ గెలిచి ఉండేదని అన్నారు. కాషాయ జెర్సీలు ఇచ్చి ఆడించాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. ప్రాక్టీస్ సెషన్స్‌లో మాత్రం కాషాయ జెర్సీలు వేసుకుని ప్రాక్టీస్ చేశారని అన్నారు. 'కోల్‌కత్తాలోని ఈడెన్ గార్డెన్స్‌లోనో లేదంటే ముంబయిలోని వాంఖడే స్టేడియంలోనో వరల్డ్ కప్ ఎ÷నైల్ మ్యాచ్ పెట్టి ఉంటే భారత్ కచ్చితంగా కప్ గెలిచేది. వాళ్లు కాషాయ జెర్సీలు ఇచ్చి ఆడించాలని చూశారు. కానీ మన ప్లేయర్స్ అందుకు ఒప్పుకోలేదు. ప్రాక్టీస్ సెషన్స్‌లో మాత్రం కాషాయ జెర్సీలు వేసుకున్నారు. క్రీడలకు సంబంధించిన అన్ని ఫెడరేషన్స్‌పైనా రాజకీయ ఆధిపత్యం పెరిగిపోతోంది. క్రికెట్‌లోనే కాదు కబడ్డీలోనూ కాషాయాన్ని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. కాషాయ రంగు త్యాగానికి నిదర్శనం. కానీ బీజేపీకి ఆ స్థాయి లేదన్నారు. అంతకు ముందు కూడా మమతా బెనర్జీ బీజేపీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పలు కీలక సంస్థలపై కాషాయాన్ని రుద్దేందుకు కుట్ర జరుగుతోందని మండి పడ్డారు. కచ్చితంగా మన ఇండియన్ ప్లేయర్స్ కచ్చితంగా వరల్డ్ ఛాంపియన్స్ అవుతారని అన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రతిదాన్నీ కాషాయంతో నింపేయాలని చూస్తోంది. ఇండియన్ ప్లేయర్స్‌ని చూస్తే చాలా గర్వంగా ఉంది. వాళ్లు కచ్చితంగా వరల్డ్ ఛాంపియన్స్ అవుతారు. కానీ బీజేపీ మాత్రం వాళ్ల జెర్సీలను కూడా కాషాయ రంగులోకి మార్చేయాలని చూస్తోంది. బ్లూ జెర్సీలను కాషాయంగా మార్చేయాలని చూస్తున్నారని మమతా బెనర్జీ అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫైనల్ మ్యాచ్‌ని గుజరాత్‌లో కాకుండా లఖ్‌నవూలో పెట్టుంటే కచ్చితంగా ఇండియా గెలిచేదని అన్నారు. వరల్డ్ కప్‌లో వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి టాప్‌లో ఉన్న భారత్ ఫైనల్లో మాత్రం చతికిలబడిపోయింది. ఈ మ్యాచ్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగింది. దీనిపై ఇప్పటికే రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి.

# ప్రచారంలో స్పీడ్ పెంచిన బిజెపి

**బిజెపికి మద్దతుగా రంగంలోకి పవన్ కళ్యాణ్ ◆ మరోమారు పర్యటనకు రానున్న మోడీ**



హైదరాబాద్,నవంబర్ 23 (సమ సమాజం): తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తెలంగాణలో బిజెపి ప్రచారం పెంచింది. ప్రధాని మోడీ, అమిత్ షా, నడ్డా, యోగి ఆదిత్యనాథ్‌లు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ మరోసారి తెలంగాణలో పర్యటించ నున్నారు. నవంబర్ 25వ తేదీన మహేశ్వరం, కామారెడ్డి సభల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. నవంబర్ 26న తూప్రాన్, నిర్మల్ లో బీజేపీ నిర్వహించనున్న సభల్లో, ఈ 27న మహబూబాబాద్, కరీంనగర్ లో బీజేపీ బహిరంగ సభల్లో ప్రధాని పాల్గొననున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లో రోడ్ షో లో మోదీ పాల్గొంటారని బిజెపి తెలిపింది. తెలంగాణలో బీజేపీ, జనసేన పార్టీలు కలిసి ఎన్నికల బరిలోకి దిగాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 111 స్థానాల్లో, జనసేన 8 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇప్పటికే ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తాజాగా, బీజేపీ తరపున పవన్ కళ్యాణ్ ప్రచారం చేస్తున్నారు. జనసేన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించనున్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో బుధవారం బీజేపీ అభ్యర్థి రావు పద్మకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సిటీలో రోడ్ షోలో పవన్ కళ్యాణ్ ప్రసంగించనుండగా దీనికి సంబంధించిన ఏర్పాట్లను జనసైనికులు పూర్తి చేశారు. అనంతరం వరంగల్ తూర్పు అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ రావు తరపున కూడా ప్రచారం నిర్వహించారు. గురువారం కొత్తగూడెం, సూర్యాపేట, దుబ్బాకలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నెల 25న తాండూరులో జనసేన అభ్యర్థి శంకర్ గౌడ్ కు మద్దతుగా, 26న కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ప్రేమ్ కుమార్ కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అంతే కాకుండా రాష్ట్రంలో ప్రధాని మోదీ పాల్గొనే సభల్లోనూ పవన్ పాల్గొననున్నారు. ఈ నెల 7న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభకు ప్రధాని మోదీ హాజరు కాగా, పవన్ కల్యాణ్, మందకృష్ణ కూడా పాల్గొన్నారని తెలిసిందే. అక్టోబర్ 1, 3 తేదీల్లో ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించారు. రెండ్రోజుల పర్యటలో భాగంగా అక్టోబర్ 1న జరిగే మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా రూ.13,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా రూ.6,404 కోట్లతో చేపట్టే కొత్త జాతీయ రహదారుల ప్రాజెక్టులు ఉన్నాయి. ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. మునీరాబాద్- మహబూబ్ నగర్ ప్రాజెక్టులో భాగంగా జక్లేర్ నుండి కృష్ణా వరకు కొత్తగా నిర్మించిన రూ.505 కోట్ల విలువైన రైల్వే లైనును ప్రధాని మోదీ ప్రారంభించారు. దీంతో హైదరాబాద్ - గోవాల మధ్య దూరం 102 కిలోమీటర్ల వరకు తగ్గింది. కాచిగూడ-రాయచూరు మధ్య డెము సర్వీసును కూడా మోదీ ప్రారంభించారు. మహబూబ్‌నగర్‌లో హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైపులైన్‌ను సైతం మోదీ జాతికి అంకితం చేశారు.

# త్వరలో గీతా కార్మికులకు రుణాలు ఇస్తాం : మంత్రి హరీశ్‌రావు




సంగారెడ్డి,నవంబర్ 23 (సమ సమాజం): కేసీఆర్ వచ్చాక తాటిచెట్టుకి పన్ను రద్దు చేశామని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నెల నెలా మామూళ్లు కట్టాలని, కానీ కల్లు డిపోల వైపు కన్నెత్తి చూడకుండా చేసిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో సంగారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కేసీఆర్ రాబోయే రోజుల్లో గీతా కార్మికులకు లునాలు ఇప్పించే ఆలోచన చేస్తున్నారని తెలిపారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి గెలిచి హైదరాబాద్‌లో పడ్డాడు. ఓడిపోయిన చింతా ప్రభాకర్ జనాలతోనే ఉన్నాడని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో జగ్గారెడ్డి ఒక్క ఊరు కూడా తిరగలేదని విమర్శించారు. మూడు కోట్ల రూపాయలతో ట్యాంక్ బండ్ పై సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం పెడుతున్నామన్నారు. గౌడల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందన్నారు. శ్రీనివాస్ గౌడ్, స్వామి గౌడ్‌లకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిందని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో పని చేసే వారిని దీవించాలని విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో వర్షం..ట్రాఫిక్ జామ్



హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం): హైదరాబాద్ నగరంలో ఉదయం నుంచి వర్షం పడడంతో చిత్తడిగా మారింది. వర్షపు నీటితో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనదారులు నెమ్మదిగా వెళ్తున్నారు. వర్షం కారణంగా నగరంలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు గంటల తరబడి సమయం పడుతోంది. ఫిల్మ్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, లక్డీకాపూల్, కోఠి, అబిడ్స్, రామంతాపూర్, తార్నాక, సికింద్రాబాద్, ఖైరతాబాద్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, మోహిదీపట్నం, కూకట్ పల్లి, పటాన్ చెరుతోపాటు తదితర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలతో తమిళనాడు, కేరళలో లోతట్టు ప్రాంతాల్లో వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# దొరచేతిలో తెలంగాణ బందీ

**కెసిఆర్ పాలనలో సామాన్యులకు అన్యాయం**

**ఎన్నికల ప్రచార సభలో పొంగులేటి**



ఖమ్మం, నవంబర్ 23 (సమ సమాజం): కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొమ్మిదిన్నరేళ్లుగా ఓ దొర చేతిలో బందీ అయిందని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం నాడు ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుంది, దొర చేతికి అప్పగించడానికి కాదు.. సామాన్య ప్రజానీకానికి మంచి చేయడానికే అన్నారు. కానీ కెసిఆర్ తన గుప్పిట్లో అధికారం పెట్టుకుని ప్రజలను బందీ చేశారని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఆ దొర ఫామ్ హౌస్ నుంచి బయటికి వస్తాడు. ఎన్నికలు అయిపోతే సామాన్య ప్రజానీకం కష్టాలల్లో ఏనాడు పాలుపంచుకోడు. ఎన్నికలప్పుడు మాత్రమే ఇంద్రలోకం , చంద్రలోకం చూపించి ఈ దొర మాయ మాటలు చెబుతాడు. ఈ దొర మాయమాటలకు మోసపోతే మళ్లీ మనం గోసపడుతాం అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంతో మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజారాజ్యాన్ని తెచ్చుకుందాం. నిత్యం మీతోనే ఉంటా మిమ్మల్ని కాపాడుకుంటూ ఉంటాను. ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి మీ శీనన్నని అత్యధిక మెజార్టీతో గెలిపించండి. కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఇప్పటివరకు ప్రజల సొమ్ము దోచుకొని దాచుకున్నాడు. దోచుకొని దాచుకున్న సొమ్ముతో అక్కడ రేవంత్‌రెడ్డిని, ఇక్కడ నన్ను ఓడించడానికి కోట్లు ఖర్చు చేస్తున్నాడు. ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రజల కోసం బాధపడుతున్నట్లు మోసపు కన్నీరు కారుస్తున్నారు. ఒక వ్యక్తి కన్నీరు పెడుతున్నాడని ఆలోచిస్తే రాబోయే ఐదేళ్లు మనం ఆ కన్నీళ్లు భరించాల్సి వస్తుంది. మీరు ఉన్నారనే ధైర్యంతోనే కేసీఆర్‌ని ఎదిరిస్తున్నాను. రేపు అసెంబ్లీలో తప్పకుండా అధికారపక్షంలో నేను, ప్రతిపక్షంలో కేసీఆర్ ఉంటాడు. అసెంబ్లీలో ప్రతిరోజు చేసిన తప్పులను నిగ్గదీసే కార్యక్రమం ఉంటదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు

**అధికారులతో మంత్రి కాకాని సమీక్ష**



అమరావతి, నవంబర్ 23 (సమ సమాజం): రాష్ట్రంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రంలోని కరువు ,కాలానుగుణ పరిస్థితులను వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమావేశమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సమీక్షించారు. రాష్ట్రంలో ఇప్పటికే 7 జిల్లాలోని 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం. 80 మండలాల్లో తీవ్రంగాను, 23 మండలాల్లో మోస్తరుగాను కరువు పరిస్థితులు నెలకొన్నట్లు గుర్తించింది. రైతు పక్షపాతి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న నేపథ్యంలో రైతులకు అన్ని విదాలుగా అండగా ఉంటామని, రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, పంట నష్టపోయిన రైతులను అన్ని విదాలుగా ఆదుకోవడం జరుగుతుంది మంత్రి భరోసా ఇచ్చారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందు అవసరమైన సాయం కోసం కేంద్రానికి ఇప్పటికే ప్రభుత్వం నివేదిక సమర్పించింది.కరువు మండలాల్లో జరిగిన పంటనష్టాన్ని అంచనా వేసేందుకు ఇప్పటికే క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. నేటితో పూర్తి కానున్న పంట నష్ట అంచనా కార్యక్రమం. సోషల్ ఆడిట్ కై ఈ నెల 29 న గ్రామ సచివాలయాల్లో పంట నష్టపోయిన జాబితాలను ఉంచేందుకు సిద్దం అవుతున్న అధికారులు. డిశంబరు 1 కల్లా పంట నష్టపోయిన రైతుల తుది జాబితా సిద్ద చేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, ఉద్యానవన శాఖ కమిషనర్ ఎస్ శ్రీధర్ తో పాటు వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన పలువురు అధికారులు ఈ సమావేశం పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలు వేగం

**దూకుడు పెంచిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ◆ పోటాపోటీ ప్రచారంతో వేడెక్కిన తెలంగాణ**



హైదరాబాద్, నవంబర్ 23 (సమ సమాజం): ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలు వేగం పెంచాయి. ఎవరికి ఎవరు తక్కువ కాదన్న రీతిలో పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా ముందుకు సాగుతున్నాయి. ఆఫ్‌లైన్ ప్రచారంలో ఇలా ఉంటే ఆన్‌లైన్ ప్రచారంలో ఎవరూ తగ్గడం లేదు. ఒకరికి మించి మరొకరు సోషల్ మీడియాలో దుమ్ము రేపుతున్నారు. పార్టీలతోపాటు నాయకులంతా ఎవరికి వారుగా టీంలను ఏర్పాటు చేసుకొని సోషల్ మీడియాను విస్తృతంగా వాడుకుంటున్నారు. ప్రత్యేక ఇంటర్వ్యూలు, సమాన్య ప్రజల పేరుతో ప్రత్యేక ముఖాముఖీలు అంటూ ఓటర్లను తమ వైపు తిప్పుకు నేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రకటన వచ్చినప్పటి నుంచి దూసుకెళ్తున్న బీఆర్ఎస్... ప్రచారంలో కూడా అదే స్పీడ్ కొనసాగిస్తోంది. ప్రత్యర్థులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదన్న ఆలోచనతో అందివచ్చిన ఏ అవకాశాన్ని వదలడం లేదు. కచ్చితంగా హ్యాట్రిక్ సాధిస్తామని చెబుతున్న సీఎం కేసీఆర్.. ఎక్కడా అలసత్వం లేకుండా అందర్నీ పరుగులు పెట్టిస్తున్నారు. ప్రతి నిత్యం ప్రచార సభల్లో పాల్గొంటూ కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కరెంట్, ధరణి, రైతుబంధులను ప్రస్తావిస్తున్నారు. తాజాగా రేవంత్ గబ్బు అంటూ విమర్శలకు దిగారు. వారం రోజులే గడువు ఉన్నందున కేసీఆర్ తన ప్రచారాన్ని మరింత వేగం పెంచబోతున్నారు. ఇప్పటికే 70కిపైగా నియోజకవర్గాల్లో ప్రచారం చేసిన ఆయన...ప్రచార గడువు ముగిసేలోపు వంద నియోజకవర్గాలను చుట్టేయాలని ఆలోచనలో ఉన్నారు. ఓవైపు కేసీఆర్ ప్రచారం హోరెత్తిస్తుంటే మరోవైపు హరీష్, కేటీఆర్ కూడా రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. మండల స్థాయిలో ప్రచారం చేస్తూ పదేళ్లు సాధించిన ప్రగతిని ప్రజలకు వివరిస్తున్నారు. మిగతా మంత్రులు, ఇతర నేతలు తమ తమ నియోజకవర్గాలకే పరిమితమైన గెలుపు తలుపు తట్టేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు కూడా అధికార పార్టీకి దీటుగా ప్రచారంలో మునిగిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చుట్టేస్తున్న రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, పడుతున్న ఇబ్బందులు వివరిస్తు న్నారు. తాము అధికారంలోకి వస్తే తీసుకోబోయే పథకాలతోపాటు మేనిఫెస్టో ప్రజలకు తెలియజేస్తూ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. రేవంత్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ అగ్రనేతలు రంగంలోకి దిగుతున్నారు. వారితోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్నప్రముఉఖ నేతలంతా తెలంగాణలో ప్రచారానికి వస్తున్నారు. వచ్చే వారం రోజుల పాటు ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా ఇతర నేతలంతా వచ్చి తెలంగాణలో ప్రచారం చేయనున్నారు. తమ పార్టీ అభ్యర్థుల విజయం కోసం ఊరూవాడా తెరగనున్నారు. తెలంగాణ పార్టీలో సీనియర్లు కూడా విభేదాల సంగతి పక్కన పెట్టి తమ నియోజకవర్గంలో విజయం కోసం మాత్రమే శ్రమిస్తున్నారు. వాళ్లెవరు కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయడంలేదు. స్టార్ క్యాంపెయినర్స్‌గా ఉన్న వాళ్లు కూడా తమ నియోజకవర్గానికో తమ జిల్లాకో పరిమితమై ప్రచారం చేస్తున్నారు. బీజేపీలో కూడా ప్రచారం హోరెత్తుతోంది. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న కాషాయం దళం ఈ మధ్య కాలంలోనే క్యాంపెయిన్ స్పీడ్ పెంచారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఈటల ముగ్గురు కూడా రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. తమకు కీలకమైన ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం శ్రమిస్తున్నారు. వారికి తోడుగా కేంద్రమంత్రులు, ఢిల్లీ నుంచి అగ్రనేతలు వచ్చి అడపాదడపా ప్రచారం చేస్తున్నారు. ఈ వారంలోనే మోదీ, అమిత్‌షా మరోసారి ప్రచారం చేయనున్నారు. మిగతా రాష్ట్రాల్లో కూడా ఎన్నికలు ఉన్నందున తెలంగాణతో పోలిస్తే ఆయా రాష్ట్రాలపై వారి ఫోకస్ ఎక్కువగా ఉంది. బీజేపీతో కలిసి పోటీ చేస్తున్న పవన్ కల్యాణ్ ప్రచారం కూడా మొదలయ్యింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొదలు పెట్టారు. పవన్ కల్యాణ్‌తో ప్రచారం తమ పార్టీకి లాభిస్తుందని బీజేపీ ప్లాన్ చేస్తోంది. ఈ వారంలో రోజుల పాటు వివిధ నియోజవర్గాల్లో జనసేన ప్రచారం చేయనున్నారు. జనసేన పోటీ చేసే 8 నియోజకవర్గాలకే ఆయన ప్రచారం పరిమితం అవుతుంది.

# తెలంగాణను బొందలగడ్డగా మార్చిన కెసిఆర్

**దుబ్బాకను విస్మరించిన బిఆర్ఎస్, బిజెపి నేతలు**

**ఇక్కడి నిధులు మళ్లించిన ఘనుడు హరీష్ రావు**

**కొత్త ప్రభాకర్ రెడ్డి పాతచితంకాయ**

**చెరుకు తనయుడిని ఆశర్వదించి గెలిపించాలి**

**దుబ్బాక సభలో పిసిసి చీఫ్ రేవంత్ పిలుపు**



దుబ్బాక, నవంబర్ 23 (సమ సమాజం): తెలంగాణను కేసీఆర్ బొందలగడ్డ తెలంగాణగా మార్చారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేసీఆర్ బక్కోడు కాదని.. భూ బకాసురుడు అని అన్నారు. ఆయన ఫామ్ హౌస్ లో పడుకునే కుంభకర్ణుడు అని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరీ సభలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. చెరుకు ముత్యం రెడ్డి ఈప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ఈ ప్రాంతానికి ఇవ్వాల్సిన నిధులను కేసీఆర్ సిద్దిపేటకు తరలించకుండా చెరుకు ముత్యం రెడ్డి కొట్లాడిండు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. దుబ్బాకకు నిధులు రాకుండా సిద్దిపేటకు తరలించుకుపోవడం మామా, అల్లుళ్లకు అలవాటైంది. కేంద్రం నిధులు తెచ్చి రఘునందన్ రావు దుబ్బాకను అభివృద్ధి చేస్తానన్నారు. మూడేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకోని రఘునందన్ కు మళ్లీ ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఈ ప్రాంతానికి 10వేల కోట్లు తెచ్చి అభివృద్ధి చేసి ఉంటే ఆయనకు ఆ హక్కు ఉండేది. పార్టీ రాజకీయ కుమ్ములాటల్లో బిజీగా ఉండు తప్పు... ఈ ప్రాంత అభివృద్ధికోసం చేసిందేమీ లేదన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి పేరులోనే కొత్త ఉంది తప్పు.. ఆయన పాతచింతకాయ పచ్చడే. దొర గడీలో కాపలా ఉండే ప్రభాకర్.. ఎందుకు దుబ్బాకను రెవెన్యూ డివిజన్ చేయలేదన్నారు. ఎందుకు దుబ్బాకకు నిధులు తెప్పించలేదో చెప్పాలన్నారు. ఎందుకు ఈ దుబ్బాకకు పీజీ కాలేజీ తీసుకురాలేదు? ఎందుకు ఇక్కడి ప్రజలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదు. పదేళ్లుగా ఎంపీగా ఉన్న ప్రభాకర్ రెడ్డి ఈ ప్రాంతానికి చేసిందేం లేదు.. కేసీఆర్ గడీలో పెద్ద జీతగాడిలా.. బంట్రోతులా పనిచేశాడు తప్ప. దుబ్బాక ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేయలేదని విరుచుకు పడ్డారు. రఘునందన్ ను, కొత్త ప్రభాకర్ రెడ్డిని చూశారు. ఇక వాళ్లను చూడాల్సిందేం లేదు. నీతికి, నిజాయితీకి మారుపేరు చెరుకు ముత్యంరెడ్డి. అలాంటి ముత్యం రెడ్డి కొడుకు శ్రీనివాస్ రెడ్డిని గెలిపించండి. పదేళ్లలో కేసీఆర్ కుటుంబం బంగారుమయంగా మారింది. తెలంగాణను కేసీఆర్ బొందలగడ్డ తెలంగాణగా మార్చారు. కేసీఆర్ బక్కోడు కాదు.. భూ బకాసురుడు.. ఫామ్ హౌస్ లో పడుకునే కుంభకర్ణుడు అంటూ విమర్శలు గుప్పించారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం. కేసీఆర్ కు చర్లపల్లి జైలులో డబుల్ బెడ్రూం కట్టించడం ఖాయం.. దోచుకుంది కక్కించడం ఖాయం అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, బిజెపి ఎంఎల్ఎ రఘునందన్‌లు దుబ్బాకకు చేసిందేమీ లేదనిరేవంత్ రెడ్డి విమర్శించారు. దుబ్బాకు చెరుకు ముత్యంరెడ్డి అభివృద్ధి చేశారని, చెరుకు ముత్యం రెడ్డిది ఆదర్శకుటుంబం అని ప్రశంసించారు. కెసిఆర్ కుటుంబానికే బంగారు తెలంగాణ అని, కెసిఆర్ తెలంగాణను బొందలగడ్డగా మార్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ వస్తుందని మళ్లీ ఇందిరమ్మ రాజ్యం పాలన వస్తుందని ప్రశంసించారు. దుబ్బాకను సిఎం కెసిఆర్ పట్టించుకోలేదని విమర్శించారు. దుబ్బాకకు వచ్చే నిధులు సిద్దిపేటకు మళ్లించారని ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే దుబ్బాక అభివృద్ధి జరిగిందని కొనియాడారు. దుబ్బాకకు డిగ్రీ కాలేజీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

# వైసిపి భారీ మోసానికి తెర తీసింది : రవీంద్ర



అమరావతి, నవంబర్ 23 (సమ సమాజం): బీసీ కులగణన పేరిట వైసీపీ భారీ మోసానికి తెరలేపిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ చేసి బీసీలకు అందే లబ్ది తొలగించేందుకు కుట్ర పన్నారన్నారు. ప్రైవేటు సంస్థలకు బీసీల సమాచారమిచ్చి తమ బతుకులు తాకట్టు పెడుతున్నారన్నారు. మోసపూరిత రాజకీయాలతో ఎన్నికల్లో లబ్ది పొందాలని చేసే ప్రయత్నమే సామాజిక బస్సు యాత్రలు అని పేర్కొన్నారు. బీసీలను బానిసలుగా జగన్మోహన్ రెడ్డి దిగజార్చారన్నారు. వైసీపీ బీసీల పోరాట కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తామని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# నటుడు ప్రకాశ్ రాజ్‌కు ఇడి నోటీసులు



హైదరాబాద్,నవంబర్ 23 (సమ సమాజం): సీనియర్ నటుడు ప్రకాశ్‌రాజ్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ కేసులో ఈడీ నోటీసులు జారీ చేసింది. రూ.100కోట్ల పోంజీ స్కీమ్ కేసుకు సంబంధించిన కేసులో విచారణకు రావాలని ఈడీ నోటీసుల్లో ఆదేశించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల ప్రకారం నవంబర్ 20న తిరుచిరాపల్లికి చెందిన ప్రణవ్ జ్యువెలర్స్‌కు చెందిన భాగస్వామ్య సంస్థకు సంబంధించిన ఆస్తులపై దర్యాప్తు సోదాలు నిర్వహించాయి. ఈ క్రమంలోనే నటుడికి సమన్లు జారీ చేసింది. ప్రణవ్ జ్యువెల్లర్ రూపొందించిన బోగస్ గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్‌పై విస్తృతంగా దర్యాప్తులో భాగంగా ప్రకాశ్‌రాజ్‌కు సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం కంపెనీకి ప్రకాశ్‌రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నారు. అయితే, ఇటీవల ఈడీ నిర్వహించిన దాడుల్లో 11.60 కిలోల బంగారు ఆభరణాలతో పాటు లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రణవ్ జ్యువెలర్స్ సంస్థ నిర్వహిస్తున్న పోంజీ పథకం, ఆర్థిక అక్రమాలకు పాల్పడిన ప్రణవ్ జువెలర్స్, ఇతరులపై తిరుచ్చిలోని ఆర్థిక నేరాల విభాగం (ఇక్షచి) దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం ఈడీ దర్యాప్తు చేస్తున్నది.

# కామారెడ్డిలో బిఆర్ఎస్‌కు షాక్

**కాంగ్రెస్‌లో చేరిన పార్టీ జడ్పీటిసి**

కామారెడ్డి, నవంబర్ 23 (సమ సమాజం): జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల జెడ్పీటీసీ తిరుమలగౌడ్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. కరీంనగర్ సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్టు వెల్లడించారు. అయితే గత కొంతకాలంగా తిరుమలగౌడ్ బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాడు. పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతోనే పార్టీ మారుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల పార్టీ చేపట్టిన కార్యక్రమాలకు సైతం ఆయన దూరంగా ఉంటు వస్తున్నారు. తనతో పాటు ఆయన అనుచరులు కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జెడ్పీటీసీ తిరుమలగౌడ్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవడంతో దోమకొండ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి కొంత నష్టం వాటిల్లే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in